Andhra Bhoomi    Dt 03/10/17

### ప్రయాణికులకు సౌకర్యంగా

# మెట్రో స్టేషన్ల విస్తరణ

**అదనంగా 15 నుంచి 20 అడుగులు విస్తరించే యోచన ★ ప్రయాణికులు సులువుగా రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు ★ ముంబయి ఘటన నేపథ్యంలో ప్రయాణికుల సంఖ్యపై అంచనా ★ ముఖ్యమైన స్టేషన్లకు త్వరలోనే స్కైవాక్‌లు ★ ఇరుకైన స్టేషన్లలో యుద్ధప్రాతిపదికన పనులు ★ మియాపూర్ - అమీర్‌పేట కారిడార్లలో ఎండి పర్యటన**



మియాపూర్-అమీర్‌పేట కారిడార్‌లోని మెట్రో స్టేషన్లను పరిశీలిస్తున్న మెట్రో ఎండి డా.ఎన్వీఎస్‌రెడ్డి, ఇంజనీర్లు

**ఆంధ్రభూమి బ్యూరో**

హైదరాబాద్, అక్టోబర్ 2: ఒక్కో మెట్రోరైలు స్టేషన్‌కు ఎంత మంది ప్రయాణికులొచ్చే అవకాశముంది. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసిన సమయంలో వచ్చే ప్రయాణికుల సంఖ్యను కాస్త ముందుగానే అంచనా వేయటంలో మెట్రోరైలు అధికారులు బిజీగా ఉన్నారు. కొద్ది రోజుల క్రితం ముంబై రైల్వే స్టేషన్‌లో ఎఫ్‌వోబి కూలి ప్రయాణికులు ప్రాణాల కోల్పోయిన ఘటన నేపథ్యంలో త్వరలోనే అందుబాటులోకి రానున్న మెట్రోరైలు స్టేషన్లలో ప్రయాణికుల సంఖ్య ఎలా ఉండనుంది? ఎంత రద్దీ వచ్చినా, వారందరి భద్రతే ప్రధాన లక్ష్యంగా ఎలాంటి వసతులు కల్పించాలి? ముంబై తరహా ఘటనలు చోటుచేసుకోకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశంపై మెట్రోరైలు మేనేజింగ్ డైరెక్టర్ డా.ఎన్వీఎస్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు ఆయన 13 కిలోమీటర్ల మియాపూర్-అమీర్‌పేట కారిడార్‌లోని మెట్రో స్టేషన్లను ఆయన సోమవారం పరిశీలించారు. అన్ని మెట్రో స్టేషన్లకు రెండు వైపులా ఉన్న ఫుట్‌పాత్‌పై సైడ్‌వాక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాక, ప్రస్తుతం నిర్మించిన మెట్రో స్టేషన్లు ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేందుకు వీలుగా అదనంగా మరో 15 నుంచి 20 అడుగుల వరకు విస్తరించనున్నట్లు. ఇందుకు పక్కనే ఉన్న ఆస్తుల నుంచి స్థల సేకరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమైన, ప్రత్యేకంగా డిజైన్ చేసిన మెట్రో స్టేషన్లలో స్కైవాక్‌లను అందుబాటులోకి తేనున్నట్లు, అలాగే కాస్త ఇరుకుగా ఉన్న మెట్రో స్టేషన్లను మరింత విస్తరించేందుకు వెంటనే పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నవంబర్ 28న ప్రారంభించాలనుకున్న కారిడార్లలో పనులు పూర్తయిన చోట భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించి స్టేషన్లను శుభ్రపర్చాలని ఇంజనీర్లను ఆదేశించారు. మెట్రోరైలు ప్రతి స్టేషన్‌ను పట్టణ పునరుజ్జీవన పనుల కింద సుమారు 700 మీటర్లచదరపు విస్తీర్ణంతో ఒక్కో మెట్రో స్టేషన్‌ను ఏర్పాటు చేసి, దాన్ని మూడు జోన్లుగా విభజించనున్నారు. ఇందులో 220 చదరపు మీటర్లతో ఏర్పాటు చేసే మెయిన్ స్టేషన్‌కు జోన్-బిగా నామకరణం చేసినట్లు, దాన్ని మెట్రో ప్రారంభించేనాటికి పూర్తి చేస్తామని ఎండి ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. స్టేషన్ లోపలకు వచ్చేందుకు, బయటకెళ్లేందుకు ప్రత్యేకంగా మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. మెట్రో స్టేషన్ మొత్తాన్ని అండర్‌గ్రౌండ్ కేబులింగ్ చేయనున్నారు.